# ప్రాస

ఇంకా బైటతిరగడం ప్రమాద మనిపించింది. ప్రమాదమయినా కాక పోయినా బొత్తిగా అవసరమేనని అనుకోవచ్చు. ఈసరికి ఆ దౌర్భాగ్యుడు తన దుఃఖాన్నుండి కొంతవరకైనా దూరం జరిగిఉంటాడు. సంఘటన జరిగి నప్పటి బరువైన విచారం, కాలం తేలికచేసి ఉండొచ్చు. అదృష్టవంతుణ్ని. అతను సిగరెట్లకోసం ఆ కొట్టుదగ్గిర పర్సుతీసి...మళ్ళీ జేబులో పెట్టుకో బొయ్యే అదనులో—ఫినిష్. ఆరువందల ముప్ఫైనాలుగు రూపాయల, పద కొండణాల కాని–రైల్వేవారిని మోసంచేసి దాచిన కాలంచాటిన టిక్కెట్టు–చిన్ని ఫొటో, ఏవో అంకెలుగిలికిన కాగితం—దగ్గుమందు పొట్లం. చుట్టూ జనం పోగయినారు. అందరూ జాలిని సరఫరాచేశారు. సానుభూతి దిగు మతిచేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వం యింకా పన్ను విధించలేదు.

ఎవరు దొంగ? అందరూ—అందరమూ దొంగను వెదికాము. దూషిం చాము. ముద్దుపళని సిగ్గుపడేభాషను వాడాము.

చివరికి...కొంతకాలానికి—దొంగ దొరికాడు. చిరిగిన లాగు, రేగిన జుత్తు. మురికివొళ్లు—ప్రతిక్షణమూ అందరినీ తినే కళ్లు. వాడే దొంగ! ఇది వరకు—ఒకటి రెండుసార్లు—కలవారి జేబులు కత్తిరించినమనిషి. వాడిమీద దెబ్బలు...దరిద్రుడు గావును, దొంగ అయినాడు. నా దొంగతనం ఫలితం అతను అనుభవించాడు. చుట్టూముసిరిన నా సోదరులు అతన్ని జుట్టు బట్టుకొని వొంచడంవరకే నే నున్నాను. ఆ మరునిమిషం పార్కు కొచ్చే శాను. అక్కడ ఉండలేకపోయాను. వాళ్లు నన్ను కనిపెడతారనికాదు—సాంఘికంగా నాకున్న విలువ, నాదుస్తులు, నాగరికత, సంభాషణా నైపుణ్యం నన్ను సైన్యంలాగా కాపాడాయి. మంత్రించిన గిరులులాగా అడ్డుకొన్నాయి.

ఇప్పటికీ నా గుండెలు దడదడలాడుతున్నాయి. జిమ్మని కుంచుకు పోతున్నాయి. తిరుగుడులో నొక్కుకు పోతున్నట్లుగానే ఉన్నాయి. ఎవరో మెదడులో మేకులుదించినట్లు బాధపడుతున్నాను. తరువాత ఆ దొంగకోసం వెతికాను. మరేమీలేదు. అతనితో నిజం చెబుదామని కానేకాదు. అతనికి కొంతకారుణ్యాం పంచిపెడదామని మాత్రమే. భాషా

భాండారంనుండి రెండుమూడు సుతిమెత్తనిపదాలు అతని చెవుల్లో వొడ్డిద్దామని మాత్రమే! దొరకలేదు. బహుశా అతని ఖర్చును ప్రభుత్వమే భరిస్తున్నదేమో ఈ పాటికి!

సోదరా! భారతదేశం 'భూతదయ'కు ప్రసిద్ధివహించింది. మహత్తరమైన మన సాంప్రదాయాన్ని నిలబెట్టావు. భారత యశోలలామకు ఖండఖండాంతరంబులగల కీర్తిసౌధంబునకు నీవొక వెలలేని మండనం బయితివి. నీకీర్తి ఆచంద్రతారార్క మీ వసుధాతలంబున నిలుచుగాక. సర్వరక్షకుడైన భగవానుడు నీకు ఆయురారోగ్యైశ్వర్యాదుల ననుగ్రహించుగాక. మఱుజన్మంబున నింతకంటె నుత్కృష్టగర్భంబున జన్మింతువు గాక. నీ కివే నా శతసహస్ర వందనములు. పరా: ఈ ఐశ్వర్యాలుగూడా, వొచ్చే జన్మలోనే పొందేటట్లు తరవాత సవరించటం జరిగింది.

ఇంటి మెట్లెక్కుతున్నాను. హఠాత్తుగా నాముందు మనిషి ప్రత్యక్షమయ్యాడు. భయంతో రెం డడుగులు వెనక్కు వేశాను. అతనూ నన్ననుసరించాడు. ఎవ రీతడు? ఎవ రీతడు?? కళ్ళు మూసుకొన్నాను. గుండె బిగబట్టాను. ఒక్క ఊపుతో ఇంట్లోకొచ్చిపడ్డాను. నా హడావుడి చూచి నా భార్య అదిరిపడ్డది. నాకోస మెవరన్నా వొచ్చారేమోనని వాకబుచేశాను. ఎవరూ రాలేదుట. "ఎవరన్నా వొస్తానన్నారా ఏమిటి?" అని అడిగింది పైగా. ఫర్వాలేదు. నా రహస్యం తెలిసిందేమోననీ, పోలీసులు నాకొరకు వేట ప్రారంభించారేమోననీ, ఆ వ్యక్తి తత్ సంబంధీకుడేమోననీ, భయపడ్డాను. కాదు. బ్రతికాను.

ఆ తరవాత రెండు రోజులకు అతను మళ్ళీ నాకు కనిపించాడు. నేను సినిమా కెడుతున్నాను. నాకంటేముందే అతనూ నడుస్తున్నాడు. ఛరాలున వెనుదిరిగి—బిరబిరనడక...రోడ్డు, జనం, బళ్ళు, రిక్షా, కేక. మరొక పావు నిమిషంలో—ఆ రిక్షాలో కూచోగలను. గుడ్డ ముందుకులాగి, ముఖానికి అడ్డుచేసుకొంటే__అతను కనుక్కో లేడు. ఎవరో మహమ్మదీయ స్త్రీ అనుకొంటాడు. పావుగంటలో యింటి కెళ్ళగలను. నా కీ సినిమా చూడాలనే పిచ్చి ఎందుకు కలిగింది? ఎందుకొచ్చాను?

నా ప్రయత్న మేమీ సాగలేదు. నేను రిక్షాలోకి వొంగుతున్నాను అతను రిక్షాలో కనిపించాడు. నా గుండె...ఊహించుకో. నేను ఎవరినుండి తప్పుకోవా లనుకుంటున్నానో, అతనే నా కెదురుపడ్డాడు. ఆ పులిచేతిలోనే

నేను చిక్కుపడ్డాను. ధైర్యంగా వెనక్కి తిరిగాను. ఇంకానయం తిరగ్గలిగాను. ఎదురుగా బ్లూలైటు అతి నీలలోహితకాంతిని చిమ్ముతున్నది. అటు వెళ్ళడం ఆరోగ్య మనిపించలేదు. ఆ వెలుగులో నన్నతను ఇట్టే గుర్తించగలడు—ఇంతకాలమూ అనుమానిస్తున్నవాడు. ఇట్టే స్థిరంచేసుకొని...చీకటి గొందులగుండా యింటిలో ప్రవేశించాను.

అతను ఎవరై ఉంటాడా అనేదే నాప్రశ్న. అతను పురుషుడేనని నేను గ్యారంటీ చేయగలను. నాలాగానే చొక్కా వేసుకొన్నాడు. నాలాగానే క్రాపు. అతని కాళ్ళకీ చెప్పులులేవు. తమాషా ఏమిటంటే, నేను ఏరోజున ఎట్లా మేకప్ ఐతే, అతనూ, అదే రోజున అట్లాగే తయారయ్యేవాడు. ఈ విషయం నేనొకసారి "జా" దగ్గిర రుజువుపరుచుకొన్నాను. నేను "జా" కోసం వెళ్లాను. "జా" నవ్వుతూ ఎదురొచ్చారు. క్రితం మధ్యాహ్నం "జా" అడిగినదాన్ని తెచ్చాను. ఆ వస్తువు "జా" కిస్తే వారు ఎంత సంతోషిస్తారో నే నూహించలేదు. "జా" గారి సంతసంకోసరం అపాయాలు తినేవాళ్ళల్లో నేనూ వొకణ్ని...కానీ—నాకంటేముందే 'అతను' ప్రత్యక్షమయ్యాడు. నే నింకా "జా"ను సమీపించనేలేదు. అతను "జా" దగ్గరగా నిలబడ్డాడు. నావొళ్ళు మండిపోయింది. ఆ వస్తువును నేలకు విసిరాను. అతనూ విసిరాడు. దీన్నిబట్టి చూస్తే అతను అక్షరాలా నన్ను అనుకరిస్తున్నాడని స్పష్టమైంది.

అత నెవరు? నాతో అతనికి పనేమిటి? ఈవిధంగా నన్ననుసరించి అతను పొందగల లాభ మెటువంటిది?...ఇత్యాది ప్రశ్న లనేకం నాకు స్ఫురించాయి. వీటికి సమాధానం చెప్పకోలేకపోతున్నాను. ఏది ఏమయినప్పటికీ అతనినుండి నేను పడవలసిన జాగ్రత్త పెద్దమొత్తంలోనే ఉన్నది. అతన్ని ఎట్లాగైనా నానుండి దూరంచెయ్యాలి.

ఆ తెల్లవారే నేను ప్రయాణమైనాను. అప్పటి కింకా ప్రొద్దుపొడవలేదు. పుష్కలంగా డబ్బుతీసుకుని...ఒంటరిగా—కాలినడకన—చేలగట్ల వెంబడి—చుట్టూ చూశాను. ఎవరూలేరు. ఆగి—పదసవ్వడికొరకై వీనులప్పళించి...లేదు. బిట్టపడ్డ గుండెతో...తిరిగి నడక...తూరుపు ఎరుపు... మంచు పొత్తిళ్ళలో ఉదయం...గడ్డిపూల పరిమళం. ఉరుదరీ కుహర సుప్తోత్థ శార్దూలముల్ ఝురవారి శోణితశంకద్రావ, అటుదిటుతిప్పి...నా ఉత్సాహం

విరిగిపోయింది. అతను నా వెనకనే వొస్తున్నాడు. కొంచెందూరంలో ఉన్నాడు. నిలబడ్డాను. అతనూ ఆగాడు...నా ప్రయాణం అతని కెట్లా తెలుసు? ఎవరు చెప్పారు? ఎవరికీ తెలీదుగదా ఈ విషయం?

ఈవిధంగా అతను చాలాకాలంనుండి నన్ననుసరిస్తున్నాడు. ఒక్కోసారి అతను చాలాతమాషాలు చేసేవాడు. ఒకసారి బహుదీర్ఘంగా కనిపిస్తాడు. గజం కడుపు, మూడుగజాల కాళ్లు. ములుకోలల్లా చేతులు. అర్థగజం తల. ఇంకోసారి మరుగుజ్జు. గలివర్ వర్ణించిన ఆరంగుళాల పరిమాణంలో ఉంటాడు. ఒక మధ్యాన్నం పెద్దకత్తి తీసుకొని, అతనికోసం ఎదురుచూస్తూ కూచున్నాను. అరగంట గడిచినా అతని జాడేలేదు. ఈ మనిషికి మందు-కత్తిగదా అనుకొన్నాను. ఇక ఏక్షణమూ కత్తిని విడిచి ఉండకూడదని నిశ్చయించుకొన్నాను. సాయంత్రం బజారుకొస్తుంటే అతను కనిపించాడు. ధైర్యంతో కత్తి చివ్వనలాగాను. అతనూ అదేపనిచేశాడు. నాకు గుండె చాలిందికాదు. ఈ యుద్ధంలో ఒకవేళ నేనే చనిపోతే? చావటం బొత్తిగా యిష్టంలేదు నాకు. జీవించి, అనుభవించవలసిన వనేకం ఉన్నాయి. ఈ ముష్టివెధవ కోసరమని నేను నా అనుభవాలను వోగులుకోలేను...ఐనా అతన్ని చంపటంగూడా అనవసరమే! అతనివల్ల నాకే అపాయమూలేదు. ఉట్టినే నన్ను వెంబడిస్తున్నంతమాత్రాన నాకు పోయేదేమున్నది గనక? ఒకవేళ ఏ పురాతన దేవతలో, బంధువులో, మిత్రులో...

ఇది కొంతకాలంక్రిందటి సంగతి. అప్పటినుండీ అతను నన్ను వెంటాడుతూనే ఉన్నాడు. అతన్నుండి నేను తప్పించుకోవాలని ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఇటీవలే అతనెవరో నేను తెలుసుకోగలిగాను. ఎందుకు నన్నట్లా అనుసరిస్తున్నాడో కూడా గ్రహించాను. అతన్ని ఈనాడు పుస్తకంలాగా చదివెయ్యగలను. అతనంటే కించిత్తు భయంగూడా లేదు. అతనెవరంటారా? చెప్పను. ఎప్పటికీ చెప్పను. ఇప్పటికే మీలో కొందరు, అతన్నిగురించి తెలుసుకొని ఉంటారని నా నమ్మకం. లేదా ఇకముందు తెలుసుకొంటారు.

—o—